క్లుప్తంగా

2న ఆర్ట్స్ కళాశాలలో జాతీయ వర్క్‌షాప్



వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వాణిజ్యశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఆర్థిక అవగాహన, సురక్షిత భవిష్యత్తు అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ డిసెంబర్ రెండో తేదీన జరుగుతుందని ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి పీవీవీ.సత్యనారాయణ, జి.చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాలీబాల్‌లో ఎస్‌కేవీటీకి ద్వితీయ స్థానం

ప్రకాశం నగర్: నన్నయ్య విశ్వవిద్యాలయ పరిధిలో జరిగిన మహిళా వాలీబాల్ ఇంటర్ కాలేజీయేట్ టోర్నీలో తమ కళాశాల విద్యార్థినులు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఎస్‌కేవీటీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రాజబాబు శనివారం ప్రకటనలో తెలిపారు. ఏలూరు సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో ఈ నెల 22, 23 తేదీల్లో ఈ టోర్నీ జరిగిందన్నారు. మొత్తం 16 జట్లు తలపడినట్లు పేర్కొన్నారు.

27న వేణుగాన కచేరీ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): విజయవాడలో డిసెంబర్ 10, 11, 12 తేదీల్లో జరగబోయే కృష్ణవేణి సంగీత నీరాజనం మ్యూజిక్ ఫెస్టివల్‌కు ముందస్తు కార్యక్రమాలు జిల్లాలో నిర్వహిస్తున్నట్లు విజయ శంకర్ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నాగలక్ష్మి శనివారం ప్రకటనలో తెలిపారు. టూరిజం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మ్యూజిక్ ఫెస్టివల్ సాగనుంది. రాష్ట్రంలో బొబ్బిలి, రాజమహేంద్రవరం, లేపాక్షి, ముువ్వ, నెల్లూరు, కర్నూలులో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరం శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో సోమవారం 4 నుంచి 6.30 గంటల వరకు డాక్టర్ మండా అనంత కృష్ణ (తిరుపతి) వేణుగాన కచేరీ నిర్వహిస్తామన్నారు.

నూతన కార్యవర్గం

కడియం: యూటీఎఫ్ కడియం మండల శాఖ నూతన కార్యవర్గం శనివారం ఎంపికై ంది. జిల్లా కోశాధికారి ఈవీవీఎస్ఎస్ ప్రసాద్ పరిశీలకునిగా వ్యవహరించిన ఈ ఎన్నికల్లో గౌరవాధ్యక్షుడిగా లక్ష్మణకుమార్, అధ్యక్షుడిగా వి.శాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా బి.అబ్బాయి ఎన్నికయ్యారు.

క్రీస్తు రెండవ రాకడ పండగ



ప్రార్థనలు చేస్తున్న ఆగమనరావు తదితరులు

కడియం: మండలంలోని దామిరెడ్డిపల్లిలో గల బైబిలు మిషను మహిమ మందిరం రెవరెండ్ డి.రత్నరాజు ఆధ్వర్యంలో యేసుక్రీస్తు రెండవ రాకడ పండగ నిర్వహించారు. గుంటూరు బేతేలు గృహ బైబిలు మిషను అధికారి ఆగమనరావు, రెవ మధుకిరణ్, బ్రదర్ డి.ఫ్రాన్సిస్‌లు సందేశాలను ఇచ్చారు. క్యాండిల్ లైట్ సర్వీస్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రెవ సీహెచ్ రత్నదీప్ ముగింపు ప్రార్థనతో కార్యక్రమం ముగిసింది. బ్రదర్ రత్నకుమార్, కె.ప్రసాద్, సంఘ విశ్వాసులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

కడియపులంకలో ప్రచారం

కడియం: మండలంలోని కడియపులంకలో జనసేన–టీడీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి తమ ఉమ్మడి మేనిఫెస్టోపై శనివారం ప్రచారం చేపట్టారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్, ఇరు పార్టీల నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమ్మె నోటీసు

కడియం: తమ సమస్యల పరిష్కారానికి డిసెంబర్ 20 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ఏపీ సర్వశిక్షాభియాన్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కడియం మండల శాఖ తెలిపింది. ఈ మేరకు సంబంధిత ఉన్నతాధికారులకు సమ్మె నోటీసును శనివారం అందజేశారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని నోటీసులో పేర్కొన్నారు.

సారా బట్టీలపై దాడులు

రాజమహేంద్రవరం రూరల్: సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ సిబ్బందితో రాజానగరం మండలం నామవరం గ్రామంలో సారాబట్టీలపై శనివారం దాడులు నిర్వహించారు. 800లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసి, 40లీటర్ల సారాను, ఒక గ్యాస్ సిలిండర్, రెండు వెస్సల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పిడింగొయ్యికి చెందిన తెల్లమేకల శివాజీ, కడియం మండలం మురమండకు చెందిన నాయుడు చిట్టిరాజు(శివ)ను అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు.

మత సామరస్య సుగంధం

- ముస్లింలతో పాటు, హిందువులు కూడా హాజరయ్యే వేడుక
- నేడు హజరత్ మహబూబ్ సుభానీ కరీముల్లాషా ఖదరీ గంధమహోత్సవం
- 63 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా నిర్వహణ



గంధం తీసుకువస్తున్న సినీనటుడు అలీ (ఫైల్)



హజరత్ మహబూబ్ సుభానీ కరీముల్లాషా ఖదరీ దర్గా



ఊరేగింపులో పాల్గొనే ఒంటెలు

సీటీఆర్ఐ: మత సామరస్యానికి ప్రతీకగా గంధోత్సవాన్ని చెప్పుకోవచ్చు. ముస్లింలతో పాటు, హిందువులు కూడా అక్కడ గంధోత్సవాన్ని జరుపుకుంటారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న హజరత్ మహబూబ్ సుభానీ కరిముల్లాషా ఖదరీ దర్గాలో ఆదివారం 63వ ఉరుసు గంధోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. 1952 సంవత్సరంలో ఈ దర్గాని నిర్మించారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ఏటా గంధోత్సవాన్ని దర్గా కమిటీ నిర్వహిస్తోంది. దైవజనులు హజరత్ మహబూబ్ సుభానీ ఇరాక్‌లో చనిపోయారు. అక్కడి నుంచి జెండా తీసుకువచ్చి రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద స్థాపించారు. అప్పటి నుంచి ఇరాక్‌లోని దర్గాలో ఏవిధంగా పూజలు చేస్తున్నారో ఇక్కడ కూడా అదేవిధంగా చేస్తున్నారు.

ఒంటెలు, ఫకీరులు, మేళతాళాలతో...

గంధోత్సవం రోజు బాబా వారికి తీసిన గంధాన్ని నగరంలో పలుచోట్ల ఊరేగిస్తారు. ఒంటెలు, ఫకీరులు, మేళతాళాలు, గుర్రాలతో ఈ ఊరేగింపు జరుగుతుంది. నెహ్రూనగర్, రాజేంద్రనగర్, వై.జంక్షన్ వరకు వెళ్లి మళ్లీ దర్గా వద్దకు ఈ ఊరేగింపు చేరుకుంటుంది. జెండాలతో ముస్లింలు, హిందువులు ఈ ఊరేగింపులో పాల్గొనడం విశేషం. గంధం తీసుకోవడానికి అన్ని మతాల వారు ప్రాధాన్యం ఇస్తారు. బాబా ప్రసాదంగా ఏర్పాటు చేసే విందులో సుమారు పదివేలకి పైగా అన్ని మతాల ప్రజలు పాల్గొంటారు. కార్తిక మాసాన్ని దృష్టిలో పెట్టుకుని ఇతర మతస్తుల కోసం శాఖాహార భోజనాలు మాత్రమే ఏర్పాటు చేస్తున్నారు.

వైభవంగా నిర్వహిస్తాం



ఈ ఉత్సవాన్ని ఏటా వైభవంగా నిర్వహిస్తాం. ఒంటెలు, గుర్రాలు, మేళతాళాలతో ఈ గంధాన్ని నగరంలో ఊరేగిస్తాం. ప్రజాప్రతినిధులు, అధికారులు, అన్ని వర్గాల వారు ఈ గంధం తీసుకోవడం ఒక వరంగా భావిస్తారు.

– సయ్యద్ గౌస్ మొహిద్దీన్, దర్గా అధ్యక్షుడు

మా అమ్మ తర్వాత నేను బాధ్యత తీసుకున్నా



నేను ఏటా ఈ దర్గాలో బాబాకి గంధోత్సవం నిర్వహిస్తున్నాను. అంతక్రితం మా అమ్మ ఈ గంధోత్సవాన్ని నిర్వహించేవారు. ఆమె తరువాత నేను ఆ బాధ్యత తీసుకున్నాను. ఈ ఉత్సవంలో ఇతర మతస్తులు కూడా పాల్గొని బాబా ఆశీస్సులు పొందుతారు.

– సయ్యద్ హజర్నీ అమీరున్నీషా, దర్గా నిషానీ

దర్గాను అభివృద్ధిలోకి తీసుకువస్తాం



నగరంలో ఉన్న పురాతనమైన, ప్రసిద్ధిగాంచిన ఇస్లామిక్ కేంద్రాలలో ఈ దర్గాకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఏడాదికి ఒకసారి ఘనంగా జరిగే గంధోత్సవంలో జిల్లా వ్యాప్తంగా ఎందరో ప్రముఖులతోపాటు వేలాదిగా సామాన్య భక్తులు ఇక్కడ భోజనాలు చేయడం విశేషం. రాబోయే రోజుల్లో ప్రభుత్వ సహకారంతో ఈ దర్గాను మరింత వృద్ధిలోకి తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తాం.

– మొహమ్మద్ ఆరిఫ్, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్

ప్రతి గుండె గుడిలో జగనన్న



గడప గడపకూ మన ప్రభుత్వంలో డాక్టర్ గూడూరి

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో విప్లవాత్మక సంస్కరణలతో ప్రజారంజక పాలన సాగిస్తూ ప్రతి గుండె గుడిలో జగనన్న సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక 37వ డివిజన్‌లో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగనన్న ప్రజల యోగక్షేమాలు తెలుసుకొని రమ్మన్నారని, మరొకసారి మీ ఆశీస్సులు మద్దతు జగనన్నకు అందించాలని కోరారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల సంతృప్తిని తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించే చర్యలు చేపట్టారు. స్థానిక కంటిపూడి రామారావు మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. ఎనిమిదో తరగతి విద్యార్థిని తిరగటి శ్రేష్ఠ రాజ్యాంగ ఆమోద దినోత్సవం గురించి అనర్గళంగా మాట్లాడడంతో డాక్టర్ శ్రీనివాస్ ఆమెను ప్రశంసించారు. పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నాయకులు మజ్జి అప్పారావు, బర్రే కొండబాబు, సబ్బారపు సూరిబాబు, బాలాజీరెడ్డి, చోడదాసి సుందర్ సింగ్, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో యువకుడిపై దాడి



గాయపడిన మణిరత్నంను ఎంపీ భరత్‌రామ్‌కు చూపిస్తున్న వాడపేట వాసులు

ధవళేశ్వరం: స్థానిక కాటన్‌పేటలో వాడపేటకు చెందిన జ్యోతుల మణిరత్నంపై నలుగురు యువకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఘటనకు సంబంధించి ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వాడపేటకు చెందిన జ్యోతుల మణిరత్నం శుక్రవారం రాత్రి 10.15 గంటల సమయంలో లక్ష్మీజనార్దన స్వామి కాలనీలో ఉన్న తల్లిదండ్రుల ఇంటికి వెళుతుండగా కాటన్‌పేట వద్ద కేతా సుధీర్‌కుమార్ మరో ముగ్గురు యువకులు అడ్డగించారు. అనంతరం మణిరత్నాన్ని కేతా సుధీర్‌కుమార్ ఇంట్లోకి తీసుకువెళ్లి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం జ్యోతుల మణిరత్నం వద్ద రూ.7వేల నగదు, సెల్‌ఫోన్ లాక్కున్నారు. తీవ్రంగా గాయపడిన మణికుమార్ వారి వద్ద నుంచి తప్పించుకొని రోడ్డు మీద పడిపోయాడు. స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకొని ఆసుపత్రికి తరలించారు. ఎస్సై వి.క్రాంతి కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి: ఎంపీ భరత్

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ పోలీసులకు సూచించారు. గాయపడిన మణిరత్నంను తీసుకొని వాడపేట వాసులు శనివారం ఎంపీని కలిసి సమస్యను వివరించారు. గ్రామంలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎంపీని కోరారు. జిల్లా ఎస్పీ జగదీష్ , సీఐ కె.మంగాదేవితో ఎంపీ ఫోన్‌లో మాట్లాడి దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నిర్మాణాత్మకంగా వై ఏపీ నీడ్స్ జగన్



సమావేశంలో చర్చిస్తున్న నేతలు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం కార్యక్రమాలను నగరంలో నిర్మాణాత్మకంగా నిర్వహించాలని పార్టీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ క్లస్టర్ అధ్యక్షులకు సూచించారు. శనివారం సిటీ కార్యాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతున్న తీరుపై సమీక్ష నిర్వహించి పలు సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు తెలియజేసేందుకు క్షేత్రస్థాయిలో ప్రతీ ఒక్కరూ కృషి చేయాల్సి ఉందన్నారు. గృహ సారథుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, క్లస్టర్ ప్రెసిడెంట్లు పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, అజ్జరపు వాసు, పార్టీ నాయకులు మానే సూర్యచంద్రరావు (దొరబాబు), కొత్త విజయరాజ్యలక్ష్మి, సీరపు నగేష్ చంద్రారెడ్డి (గణేష్) పాల్గొన్నారు.

మిల్లెట్స్ సాగుపై ఆసక్తి చూపాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: రానున్న రబీలో మిల్లెట్స్ సాగుకు రైతులు ఆసక్తి చూపాలని, ఆ మేరకు సబ్సిడీపై విత్తనాలు అందజేస్తామని రైతులకు అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ మాధవీలత తెలిపారు. శనివారం విజయవాడలోని సీఎస్ విడిది కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర, ఎంఎస్ఎం ఈ – ఏం ఎస్ ఈ సిడిపి పథకం కింద కామన్ ఫెసిలిటీ సెంటర్స్ పైన, కలెక్టర్ల వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలు, ఎఫ్‌సీ గోడౌన్ల కోసం భూమిని అందించడం, వ్యవసాయం, పశుసంరక్షణ, డెయిరీ డెవలప్‌మెంట్, మిల్లెట్స్ ప్రమోషన్, ఇంటి స్థలాలు,గృహ నిర్మాణం, డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌పై సూచనలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాధవీలత, జేసీ ఎన్.తేజ్ భరత్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి 24 గంటల్లో చెల్లింపుల చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 231ఆర్‌బీకేలలో 182 ఆర్‌బీకేల్లో కొనుగోళ్లు ప్రారంభించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో అంచనాలకు అనుగుణంగా అవసరమైన గన్నీ బ్యాగులను ఆర్‌బీకేలలో అందుబాటులో ఉంచామన్నారు. విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కోసం రూట్ ప్రోగ్రాం సిద్ధం చేశామన్నారు. సీపీఓ ఏ.ముఖలింగం, డీపీవో జె.సత్యనారాయణ, డీఎల్‌డీవో పి.వీణాదేవి, హౌసింగ్ అధికారి జి. పరశురామ్, వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్‌జీటీ సత్య గోవింద్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో ×మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలన₹ పై అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత మాట్లాడుతూ అనేక మంది అక్రమ రవాణా, వెట్టిచాకిరీకి గురవుతున్నారన్నారు. బాధితులను కాపాడేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు తీసుకోవలసిన చర్యలు, బాధితులకు అందుబాటులో ఉన్న న్యాయ సేవలపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాల అందేలా న్యాయ సేవాధికార సంస్థ కేంద్ర బిందువుగా వ్యవహరిస్తుందన్నారు. మద్రాస్ హై కోర్టు న్యాయవాది సి.రాజ్‌కుమార్ దర్యాప్తు దశలో కీలక అంశాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రీసోర్స్ పర్సన్, ఐఎంజే సభ్యులు డాక్టర్ జోబీ, ఐజేయం ప్రోగ్రాం పార్టనర్ ఎం.జేసుదాస్, వివిధ ఎన్‌జీవో సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

సుస్థిరమైన జీవనోపాధి పొందాలి

డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం ఇన్‌చార్జి పీడీ వీణాదేవి



డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ వీణాదేవికి స్వాగతం పలుకుతున్న మహిళా సమాఖ్య ప్రతినిధులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుకుని ప్రతి కుటుంబం సుస్థిరమైన జీవనోపాధిని పొందాలని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ పి.వీణాదేవి అన్నారు. శనివారం మధ్యాహ్నం ఆల్కాట్‌తోటలోని రూరల్ స్కిల్ ఎంప్లాయిమెంట్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్‌లో జిల్లా మహిళా సమాఖ్య రెండవ సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జెండర్ మాసోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వీక్షిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా జనవరి 26వ తేదీ వరకు జరిగే సమావేశాలలో సంఘసభ్యులు పాల్గొనాలన్నారు. 15 ఏళ్ల దాటినవారు ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలలో పాల్గొనేలా సమాచారం ఇవ్వాలన్నారు. బ్యాంక్ లింకేజ్, స్త్రీ నిధి, సీఈఎఫ్, వీఆర్ఎఫ్, ఉన్నతి వంటి పథకాలను సమీక్షించారు.

నూతన పాలకవర్గం

సమావేశంలో జిల్లా మహిళా సమాఖ్య నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కె.సుజాత (నిడదవోలు), ప్రధాన కార్యదర్శిగా తుర్రం సత్యవతి (గోకవరం), కోశాధికారిగా లక్ష్మీప్రసన్న(రాజానగరం), ఉపాధ్యక్షురాలిగా కురియాల కస్తూరి (సీతానగరం), ఉప కార్యదర్శిగా చదలవాడ మరియమ్మ(చాగల్లు)ను ఎన్నుకున్నారు. డీపీఎంలు వై.జనార్దనరావు, ఎం.సంపత్ కుమార్, బి.హేమంత్, ఏ.గణేశ్వర రావు , స్త్రీ నిధి ఏజీఎం ధర్మేంద్ర, ఏపీఎం కె.త్రిమూర్తులు పాల్గొన్నారు.

బ్రహ్మాజీరావు మృతి తీరని లోటు



సంతాప సభలో పాల్గొన్న ప్రముఖులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా యూటీఎఫ్ శాఖ మాజీ జిల్లా అధ్యక్షుడు కోరుకొండ బ్రహ్మాజీ రావు (88) మరణం తీరని లోటని ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ పిల్ల వెంకటేశ్వరరావు అన్నారు. బ్రహ్మాజీరావు సంతాప సభ స్థానిక లింగంపేటలోని ఆయన ఇంటి వద్ద శనివారం జరిగింది. ఎమ్మెల్సీ పిల్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యూటీఎఫ్ ఉద్యమంలో బ్రహ్మజీరావు ఎన్నో పాత్రలు పోషించారన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ తాను బ్రహ్మజీరావు శిష్యుడనని, ఆయన పాటలు, కథల రూపంలో చెప్పడంలో చాలా నేర్పరన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని తెలిపారు. ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు షేక్ సాబ్జి మాట్లాడుతూ బ్రహ్మజీరావు ఉపాధ్యాయ సమస్యలపై ప్రాతినిధ్యపు లేఖలు రాసి పరిష్కారం చేసే వారన్నారు. ఆయన పదవీ విరమణ చేసినా ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పనిచేసే వారన్నారు. రాష్ట్ర కార్యదర్శి అరుణ్ కుమారి, అన్నారం, రాఘవులు, చక్రవర్తి, నగేష్ పాల్గొన్నారు.

మెట్ల మార్గాన్ని మూయవద్దు

ధవళేశ్వరం: జాతీయ రహదారి ఇండస్ట్రియల్ కాలనీ వద్ద ఉన్న మెట్ల మార్గాన్ని మూయవద్దని స్థానికులు డిమాండ్ చేశారు. అక్కడ జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో జాతీయ రహదారి వద్ద ఉన్న మెట్ల మార్గాన్ని మూసివేసే పనులను శనివారం ప్రారంభించారు. ఇటీవల ఎస్పీ జగదీష్ బ్లాక్‌స్పాట్స్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. దీంతో మెట్ల మార్గాన్ని మూసివేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ధవళేశ్వరం గ్రామం నుంచి ఇండస్ట్రియల్ కాలనీలోకి వెళ్లేందుకు పాదచారులు ఇదే మార్గాన్ని ఉపయోగిస్తున్నారని కాలనీవాసులు సీఐ కె.మంగాదేవి దృష్టికి తీసుకువెళ్ళారు. రెండు రోజులు పనులు ఆపాలని, తాము సమస్యను కలెక్టర్, ఎంపీ దృష్టికి తీసుకువెళతామని స్థానికులు కోరడంతో మూసివేత పనులను నిలిపివేశారు.

యాదవ సామాజిక వర్గ సంక్షేమానికి కృషి



మాజీ మంత్రి అనిల్‌కుమార్‌ను కలసిన సంఘ ప్రతినిధులు, జక్కంపూడి గణేష్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: పేదరికంతో ఇబ్బందులు పడుతున్న యాదవ సామాజిక వర్గానికి చెందిన వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేయనున్నట్లు మాజీ మంత్రి అనిల్ కుమార్‌యాదవ్ భరోసా చెప్పారు. శనివారం జిల్లా మీదుగా వెళుతూ ఆయన రాజమహేంద్రవరంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. నగరానికి చెందిన శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జానా కేశవ్, సంఘం ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ఆయనను కలిశారు. వీరి వెంట యాదవ సంక్షేమ సంఘం పెద్దలు ప్రసాదులు హరినాథ్, నోడగల సుధా యాదవ్, శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బొట్టా వీరబాబు, సారిపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీని ప్రక్షాళన చేస్తా



ఆర్‌జేడీ సుధాకర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తానని వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్ అన్నారు. శనివారం ఆయన వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణను పరిశీలించారు. అనంతరం వివిధ షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. అనంతరం జాయింట్ డైరెక్టర్ సుధాకర్ మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఇతరులు లోనికి రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇందుకు అవుట్ సోర్సింగ్‌లో నలుగురు సిబ్బందిని నియమిస్తామన్నారు. వివిధ షాపుల యజమానులు ఆక్రమణలు చేశారన్నారు. వాటిని తొలగించడం లేదా, ఆక్రమించుకున్న స్థలానికి అద్దె వసూలు చేస్తామన్నారు. కొంతమంది ఇంటి యజమానులు మార్కెట్ కమిటీ స్థలాన్ని ఆక్రమించి ఇళ్లను నిర్మించుకున్నారని, వాటిని పోలీస్ బందోబస్తుతో తొలగిస్తామన్నారు. ఇటీవల కాలంలో మార్కెట్ కమిటీపై వస్తున్న ఆరోపణలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టామన్నారు. ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్ కమిటీ మార్కెట్ ఫీజు లక్ష్యం 2023–24కి రూ.3.79 కోట్లు కాగా ఇప్పటివరకు 35 శాతం రూ.1.31 కోట్లను వసూలు చేశామన్నారు. షాపులు, ఇతర అద్దె బకాయిలు రూ.90 లక్షలు ఉండగా, ఇప్పటివరకు రూ.70 లక్షలు వసూలు చేశామన్నారు. ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి సెలవులో ఉన్నారని, త్వరలోనే ఇన్‌చార్జిని నియమిస్తామని తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో అనధికారికంగా నిర్మించిన ప్రహరీని శనివారం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్ సిబ్బంది, జేసీబీతో తొలగింపచేశారు. మార్కెట్ కమిటీ అద్దెకు ఇచ్చినంత మేరకే సదరు షాపు యజమాని వినియోగించుకోవాలన్నారు. అలా కాని పక్షంలో ఆక్రమించిన స్థలానికి మార్కెట్ కమిటీ నిబంధనల మేరకు అద్దె చెల్లించాల్సి ఉంటుందని రీజనల్ జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్ తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కంబాలచెరువు: స్థానిక రోడ్డు కం రైల్వే వంతెనపై నుంచి గోదావరి నదిలోకి దూకి గల్లంతైన శెట్టి వినోద్‌కుమార్ (32) మృతదేహం లభ్యమైంది. ఏలేశ్వరానికి చెందిన శెట్టి వినోద్‌కుమార్ శుక్రవారం హుకుంపేటలోని అతని అన్నయ్య ఇంటికి వచ్చాడు. అక్కడి నుంచి మోటారు సైకిల్‌పై వెళ్లి, వాహనాన్ని పార్కు చేసి గోదావరి నదిలో దూకాడు. అతని మృతదేహం మర్నాడు గోదావరి నదిలో తేలడంతో రెండో పట్టణ పోలీసులు దానిని వెలికితీశారు. పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలు



శ్యామల	:	ఆదికేశవ
సూర్యమినీ	:	మాఊరిపొలిమేర–2, టైగర్–3
సూర్యప్యాలెస్	:	నెపోలియన్
స్వామి	:	మంగళవారం
శివజ్యోతి	:	కోటబొమ్మాళి పిఎస్
అనుశ్రీ	:	భగవంత్‌కేసరి
రాజా	:	మంగళవారం
అశోక	:	సప్తసాగరాలు దాటి
ఊర్వశి	:	కీడాకోలా, మాఊరిపొలిమేర–2
రంభ	:	జపాన్
మేనక	:	సౌండ్‌పార్టీ
అప్సర నామవరం	:	ఆదికేశవ
విఎస్.మహల్ ధవళేశ్వరం	:	ఆదికేశవ
మురళీకృష్ణ కడియం	:	ఆదికేశవ
వెంకటసూర్య	:	కోటబొమ్మాళి పిఎస్